

# మానినీ "మన్మథ"లు

"మన్మథ"ని పూర్తిగా చదివేసరికి నరసింహానికి చాలా కోపం వచ్చింది. ఏమిటి ఈ పత్రిక ఉద్దేశ్యం? అవినీతిని నిర్మూలిస్తామని ఒకమూల కబుర్లు చెప్తూ, దరిద్రపు అవినీతి కథ లేమిటి? ఏదో మిథునజ్ఞానం గురించి వ్రాసిన కొన్ని వ్యాసాలు బాగానే ఉన్నై. స్త్రీ పురుషులు పరస్పరం చెప్పుకోడానికే సిగ్గుపడే విషయాలని తెలియజేశాడు. వ్యభిచార దోషం గూర్చి ఎవడో స్వానుభావుడు వ్రాశాడు సరే. కాని ఈ బూతుకథ ఉద్దేశం ఏమిటి? ఆడవాళ్లు అలాంటి కథలు చదివితే ఇంకేమన్నా ఉందా?

ఆలోచిస్తూ కిటికీలోంచి బైటికి చూస్తున్నాడు నరసింహం. శాంత అప్పుడే పువ్వులు కోసుకుని ఇంట్లోకి వస్తోంది. ప్రక్కింటి అనసూయమ్మగారు కూడా పువ్వులు కోసుకొంటూంది. కాని శాంత కేవలం తన సౌందర్యం కోసం పువ్వులు కోసుకుంటుంది. అనసూయమ్మగారో..., దైవ ప్రార్థనకోసం పుష్పాలు ఉపయోగిస్తుంది.

నరసింహానికి అనసూయమ్మగారిని చూస్తే చాలా గౌరవం. పూజలూ పునస్కారాలూ చేస్తూ ధర్మం నిలబెట్టుకొస్తూంది. శాంత ఏం చేస్తుంది? అస్తమానం అలంకరణా, సంగీతం, ప్రేమకథలు చదవడమూనూ. పోనీ గట్టిగా చెప్పి చెయ్యి చేసుకుందామంటే- ధనవంతుల బిడ్డ- చిన్నప్పట్నించీ గారాబంగా పెరిగింది. ఏమైనా అంటే మిగిలిన జీవితంలో శాంతి సౌఖ్యాలు తనకి దూరం కావడం తప్ప మరో ఫలితం ఉండదు.

ఇంకా అతని ఆలోచనలు ఎలాగ సాగేవో గాని తంగ్‌మని-గడియారం ఏడున్నర చూపడం, వంట ఇంట్లోంచి కాఫీకి శాంత పిలుపూ అతని ఆలోచనలని ఆపేయి.

* * *

మరో నెల గడిచింది.

మరో నాలుగు "మన్మథ"లు వచ్చాయి.

ఏ పత్రికలోనైనా బూతు కథలు రావడం మానేస్తారేమోనని చాలా ఓపికతో చూశాడు నరసింహం. కాని ఫలితం కనపడలేదు. ఆ కథలు రావడమూ మానలేదు. శాంత వాటిని చాలా ఇష్టంగా చదవకా మానలేదు. చాలా కోపం వచ్చింది నరసింహానికి. పోనీ ఆ పత్రిక ఇంటికి రాకుండా చేద్దామంటే, లాభం లేదు—శాంతే నేరుగా కట్టింది డబ్బు. ఉపాయం తోచలేదు. శాంతతో ఒకసారి చెప్పి చూద్దామని నిశ్చయం చేసుకున్నాడు నరసింహం.

రాత్రి భోజనాలయ్యాయి. "మన్మథ" చదువుతూ పడుకుంది శాంత. నరసింహం ప్రక్కన ఉన్నాడనే విషయం కూడా మరచిపోయిందా అమ్మాయి. శాంత "మన్మథ" క్రింద పడవేసే పర్యంతమూ ఓపికగా వేచి ఉన్నాడు అతను. ఆమె "మన్మథ"ని టేబిల్ మీదకి విసిరింది. లైటు తగ్గించింది. ఒళ్లు విరుచుకుంటూ అతన్ని చూసి—"ఇంకా తెలివిగానే ఉన్నారా?"

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

అంది అదోవిధంగా. బహుశా—ఆమె అతని కళ్లల్లో కోపాన్ని చూసి ఉండదు... చూసినా లెక్క చేసి ఉండదు.

"బాగుంది...నీ కే దృష్టిలేనిదే ఎలా కనిపిస్తాను!" కొంచెం కోపం సూచిస్తూ అన్నాడతను.

ఇదంతా ఏదో ప్రణయ గ్రంథంలో తొలి ఘట్టంగా అనుకుందా రసికురాలు..."మీకంటే ఆ పుస్తకం ఎన్నివిషయాలు ఎక్కువ చెప్పిందో!" అంది.

అతనికి కోపం ఆగలేదు, కాస్త గట్టిగా— "అలాంటి పోకిరీ పుస్తకాలు చదవకూడదని చెప్తే నీకు తెలీదూ... గౌరవం,మర్యాదా ఉన్న వాళ్లకి ఆ పాడు కథలు చదవదగ్గవి కావు-" అన్నాడు ఆమెవేపు ముఖం తిప్పకుండానే.

ఒక చిన్న నవ్వు నవ్వింది. నెమ్మదిగా అంది కదా శాంత—"పోనీ మీ రాపాటి కథ రాసి చూపెడితే ఈ కథల్లో నీచత్వం వప్పుకుంటాను. ఏదో సరదాకి చదువుతూంటే మీరు పెద్ద పట్టింపు చేసుకొంటే ఎలాగ?...ఏమైనాసరే... ఒకకథ రాసి ఆ పత్రికచేత ముద్రింపించి 'ఇలాగ ఉండాలికథ' అని చూపండి - నేను మళ్లా అలాంటి కథలు చదివితే ఒట్టు."

శాంత మాటఅంటే మరి తిరగదు.

నరసింహం సంభాషణ ఇంత సుళువుగా తెగుతుందనుకోకపోవటంచేత కోపాన్ని అవసరానికి నిలవ ఉంచుకున్నాడు. కాని ఈ షరతు విన్నాక తన భార్య ఈ పాడు కథలు చదవకుండా ఉండే విధానం ఒకటుందన్న సంతోషం కంటె, తన రచనని "మన్మథ" ప్రచురించడంలో ఒక ప్రత్యేకత అతనికి కనిపించింది. అలాగ తన రచనని శాంత మెచ్చుకుంటే నరసింహం పొంగిపోతాడు... తెగని ఆలోచనలతో అతను నిద్రపోయాడు.

* * *

రచన చేసేడు నరసింహం. "మన్మథ" ఆఫీసుకి పంపాడు పోస్టు బిళ్ళలతో సహా. కాని మరో పదిరోజులనాటికి 'ప్లాటు ఇంకా బాగుండాలి' అనే రిమార్కుతో తిరిగి వచ్చిందా రచన.

నరసింహం ధైర్యాన్ని కోలుపోలేదు. ఏనాటికైనా "మన్మథ"లో తనరచన రాక తప్పదని అతనికో దృఢవిశ్వాసం. ఇంతకీ 'ప్రయత్నించవోయ్' అన్నాడు కవి.

ఇంకో మంచి గట్టికథ వ్రాసి నరసింహం పోస్టు చెయ్యడం, మరో వారంలో అది ఏవో రిమార్కులతో తిరిగిరావడం జరిగింది. అయితే ఈ సారి రిమార్కులు కేవలం భాషను గురించే కాబట్టి తన గ్రాంథికం అంతా వ్యావహారికానికి మార్చి మళ్లా కథ - 'రోమియో' - అనే మారుపేరుతో పంపాడు.

ఆవేళ ఆఫీసులో ఉండగా ఎవరో స్నేహితుడు ఒక "మన్మథ" పట్టుకువస్తే అందులో నరసింహం తన కథ పడిందని చూసుకున్నాడు. దరిద్రపు సంపాదకుడు, తనకి ఎంచేతో కాపీ పంపనేలేదు!

రాత్రివరకూ నరసింహం తన సంతోషాన్ని వెలిబుచ్చలేదు. శాంత మామ్మూలుగా ఆరచనలోని ఉత్కృష్టతను కీర్తిస్తూ మాట్లాడుతుంటే తను నర్మంగా మాట్లాడి చిట్టచివరకు ఆమెతో తన ప్రతిజ్ఞాపాలన కథ చెప్పదల్చుకున్నాడు.

శాంత రాత్రి పదివరకూ 'మన్మథ' ను చదువుతూనే ఉంది. నరసింహం మనస్సు ఉరకలు పెడుతూంది. ఇటువైపు తిరిగి బ్రహ్మానంద పడుతున్నాడు శాంత నోటంట పొగడ్త వినడానికి. తన శక్తినిగురించి తనే తనలో ఎంతో పొగుడుకుంటూ క్షణమొకయుగంగా గడుపుతున్నాడు...

గొడవ - శాంత మామ్మూలు లాగ ఇవేళ ఎందుకు విమర్శ మొదలు పెట్టదు?...తనకి కోపం వస్తుందని కథని పొగడడం మానేసింది కాబోలు...తను ఎంత స్వార్థపరత్వంతోనో ఆమెని ఆ కథలు చదవవద్దన్నాడు...ఇవాళ ఫలితం కనిపిస్తూంది!

శాంత పుస్తకం నిర్లక్ష్యంగా టేబిల్ మీదకి విసిరింది.దీపంతగ్గించింది. నరసింహంవేపుతిరిగింది. రెండు చేతులా అతన్ని పెనవేసింది. నరసింహం ఉబ్బి తబ్బిబ్బు లౌతున్నాడు, కోరుకున్న సంగీతం వినపడబోతోందని. తనవేపు లాక్కుంటూ అంది—"ఎవడో 'రోమియో' వ్రాశాట్ట ఈ వారం కథ. ఎంత దరిద్రంగా ఉందనుకున్నారు!...మళ్లా "మన్మథ"కి దమ్మిడీ కట్టవద్దు!..."

నరసింహానికి ఏమీ తోచలేదు.